
# పగలూ రాత్రీ

కె.వి.ఎస్.వర్మ




గోదావరి గట్టు పక్క రోడ్డు మీద పెద్ద ఊరేగింపు జరుగుతోంది. పసుపుపచ్చ బ్యానర్లతో రోడ్డంతా పసుపురంగు పులుముకుంది. కొత్త మంత్రికి స్వాగత సంరంభం. పార్టీ కార్యకర్తలు నినాదాలు చేస్తూ ముందుకెళ్తున్నారు.

ఆ ఊరేగింపు అయ్యే దాకా రోడ్డు మీదకే చూస్తూ వుండి పోయారు గట్టు చప్టా మీద కూర్చున్నవాళ్లంతా.

"అనుకున్నామని జరగవు అన్నీ, అనుకోలేదని ఆగవు కొన్నీ" అంటూ కొటేషన్‌రావు పాట అందుకున్నాడు.

"నిజమే ఫ్రెండూ. మొన్నటి ఎన్నికల్లో 'మనోడు' రావాలని గాఢంగా కోరుకుంటూ కొందరు ఎంతగానో ప్రయత్నించారు. అయినా వాళ్ల 'మనోడు' నెగ్గలేదు" అన్నాడు వాసు.

"సెబాసు, వాసూ. లెస్స పలికితివి" అన్నాడు శాస్త్రి.

వాసు సిగ్గు పడిపోయాడు.

"మడీ మడీ. అది నిన్నటి మాట. తడీ తడీ అది నేటి పాట." అంటూ కొటేషన్‌రావు అందుకున్నాడు.

"తప్పు తప్పు"అన్నాడు జగదీష్.

కొటేషన్‌రావు ఆగిపోయాడు.

"ఔను బ్రదర్. ఆ పాట ఒకప్పటి మాట. దాన్ని రివర్స్ చేసి పాడు. శ్రీశ్రీ ఏమీ అనుకోడులే"

"తడీ తడీ అది నిన్నటి మాట, మడీ మడీ అది నేటి పాట" అంటూ కోటేషన్‌రావు పాడాడు.

ఆ పాట అయ్యేక అందరూ మౌనంగా వుండిపోయారు. కవి కుమారుడూ, కథ్రాజూ ఆ రోజు రాలేదు.

"మనం సంతాపం ప్రకటించడానికా ఇక్కడి కొచ్చాం" అన్నాడు జగదీష్.

అంతా కాదన్నట్లు ముఖ కవలికలు మార్చారు.

"అయితే ఏదన్నా మాట్లాడండి"

"రోజూ అంతా ఏదో ఒకటి మాట్లాడుతున్నాం. మందు అనుభవం లేకనుకుంటాను, నాయుడు శ్రోతగానే వుండి పోతున్నాడు"

"భలేవాళ్లే. అనుభవం అంటే స్వానుభవం అని అర్థం కాదు కదా" అంటూ నాయుడు గొంతు సర్దుకున్నాడు.

"ఇది నిన్న మొన్నటి మాట కాదు. కొన్నేళ్ల క్రితం సంగతి. పల్లెటూళ్ల సంగతి మీలో కొందరికి తెలిసిందే. అక్కడ తాగుబోతంటే పచ్చి తాగుబోతు. ఇక్కడిలా ఏదో బార్ కెళ్లి ఓ క్వార్టర్ తాగేసి రావడంకాదు.

మా వూళ్లో ఎవరైనా ముండల ముఠాకోరుంటే వాణ్ని తప్పు పట్టేవారు కాదు. ఎవరైనా తాగితే మాత్రం వాణ్ని చూసి భయపడేవారు. మా మావయ్య కొడుకు సుందరానికి ఎలా అలవాటయిందో కానీ మందు అలవాటయింది. అంతకు ముందు పొలం, ఇల్లు - అంతే. మందు మొదలెట్టాక రాత్రీ పగలూ తాగడమే. తాగి పొలం వెళ్లే వాడు. చిన్న తేడా వస్తే పాలికాపును కేకలేసేవాడు. ఒకోసారి తన్నేవాడు. అంత వరకూ సుందరం అంటే ప్రాణాలు పెట్టే పాలికాపు పని మానుకున్నాడు. సుందరం ఇంకొకడ్ని పెట్టుకున్నాడు. కొన్నాళ్లకు వాడూ మానేసేడు. ఇలా కాదని ఇంకోవూరి నుంచి ఒకణ్ని తెచ్చేడు. వాడూ తాగుబోతే. వాడు ఎంత తాగినా నోరు జారేవాడు కాడు. సుందరం కొట్టినా పడేవాడు. సుందరం మందు పోయించేవాడు. పొలం పనులు సరిగా చేసేవాడు కాడు.

ఒకనాడు నేను పొలం వెళ్లేటప్పటికి సుందరం వాడిని బూతులు తిడుతున్నాడు. వాడేమో గ్లాసులో మందు పోస్తున్నాడు. సుందరం తాగుతూ తిడుతున్నాడు.

"ఏటి సుందరంబావా, ఏటీ బూతులు" అన్నాను.

"ప్రతి తొత్తు కొడుక్కీ నా వూసే కావాలి" అని , పాలికాపును ఫడీమని జెల్ల లాగేడు సుందరం.

"నాకెందుకు గొడవ"అనుకుంటూ మెల్లిగా జారుకున్నాను.

కొన్నాళ్లకు సుందరం ఓ ఎకరం పొలం అమ్మేశాడు. మరో సంవత్సరం గడిచేటప్పటికి ఇంకో ఎకరం అమ్మేడు. పరగడుపునే మందుతో పళ్లు కడుక్కోవడం మొదలెట్టాడు. రాత్రయేటప్పటికి పీకల దాకా తాగేసి వీధి అరుగుమీద కూర్చుని పేలడం మొదలెట్టేవాడు. ఎవరు కనిపించినా, వాళ్లనాపేసి సొద మొదలెట్టేవాడు. కొంతకాలానికి పొద్దు పోయేక ఆ వీధిలోకి వెళ్లడానికి జనం వెనుకాడేవారు.

నాలుగూళ్ళు గడిచే సరికి పదెకరాల పొలం మూడెకరాలకి తరిగిపోయింది. పశువులన్నింటినీ అమ్మేశాడు. పాలికాపుకి డబ్బిచ్చి మందు తెమ్మని పట్నం పంపితే వాడిక తిరిగి రాలేదు. అప్పటికే మా మావయ్య పోయాడు. మా అత్త తెగ ఏడ్చేది. సుందరం ఆరోగ్యం పూర్తిగా పాడయిపోయింది. పొట్ట బానలా తయారయింది. కాళ్లూ చేయీ తోటకూర కాడల్లా అయిపోయాయి. డాక్టర్‌కి చూపిస్తే 'మందు మానేమని ఎప్పుడో చెప్పాను. ఇప్పుడేనా మానితే ఆరోగ్యం కాస్త మెరుగు పడవచ్చు.' అన్నాడు. వాడు మానలేదు.

మా అత్త చాలా కట్టుదిట్టం చేసింది. అయినా ఎలాగోలా సారా తెప్పించుకునేవాడు. 'నేను చేసేదేమీ లేదు' అంటూ డాక్టర్ వాళ్లింటికి రావడం మానేశాడు.

ఆ రోజు నాకు బాగా గుర్తు. సుందరానికి ప్రాణం మీదకొచ్చిందంటే పరుగున వెళ్లేను. తల ఎగరేస్తున్నాడు. కాళ్లూ చేతులూ కొట్టుకుంటున్నాడు. డాక్టర్ వచ్చి చూసి పెదవి విరిచాడు. మా అత్త ఏడుస్తూ వాడి పక్కనే నిలబడింది. సుందరం తలతిప్పి, తల్లి చేయి పట్టుకుని కన్నీళ్లు పెట్టుకున్నాడు. నెమ్మదిగా చెయ్యెత్తి సంజ్ఞ చేశాడు. మా అత్త వాడి తల నిమిరి, అక్కడే వున్న పాత కాపుకి డబ్బులిచ్చి పంపింది. ఓ పావు గంటకు వాడు ఓ గ్లాసు పట్టుకుని ఆయాస పడుతూ వచ్చాడు.

మా అత్త ఆ గ్లాసు పట్టుకుని సుందరం పక్కన కూర్చుని, వాడి నోటిలో పోసింది. రెండు గుక్కలు మింగాక, తల వాల్చేశాడు." అంటూ ఆగాడు నాయుడు.

"ఆ గ్లాసులోది తులసి దళమా" అడిగాడు వాసు.

"కాదు, సారా. ఆ దృశ్యం నాకెప్పుడూ గుర్తుకొస్తుంది. అందుకే ఎందరు తాగుతున్నప్పుడు ఎన్నిసార్లు వాళ్లతో కూచున్న నేనెప్పుడూ తాగలేదు"అన్నాడు నాయుడు విచారంగా ముఖంపెట్టి.

గౌతమి ఎక్స్‌ప్రెస్ చప్పుడు వినిపించి, అంతా లేచారు. కొటేషన్‌రావు చప్టా దిగుతూ అన్నాడు.

"చెడే వాణ్ణి ఎవరూ బాగు చెయ్యలేరు. బాగు పడేవాణ్ణి ఎవరూ చెడపలేరు"

(వచ్చేవారం: గుప్తజ్ఞానం)

## సూది మందుకు స్వస్తి!

సూదిమందు (ఇంజక్షన్‌కి మరో పేరు) తీసుకుంటే రోగం త్వరగా నయమవుతుందని చాలామంది నమ్మకం. అయితే, ఇంజక్షన్ చేయించుకోవడం అంటే ఎవరికైనా భయమే. ప్రత్యేకించి చిన్న పిల్లల సంగతి చెప్పనక్కరలేదు.

ఈ నేపథ్యంలో ఇంజక్షన్లు అవసరం లేకుండా మందును సమర్థవంతంగా శరీరంలోకి నోటి ద్వారా కాకుండా ఇతర మార్గాల ద్వారా పంపడానికి శాస్త్రవేత్తలు అనేక రకాల పరిశోధనలు జరుపుతున్నారు. చర్మం ద్వారా పెన్ పరిమాణంలో వుండే గాస్‌గన్ సహాయంతో పౌడర్ రూపంలో వుండే మందులు శబ్దవేగానికి 3 రెట్ల వేగంతో శరీరంలోకి పంపే పద్ధతిని ఇప్పుడు శాస్త్రవేత్తలు రూపొందిస్తున్నారు. ఈ పద్ధతి అమలులోకి వస్తే కొంత కాలానికి ఇంజక్షన్లలో 90 శాతం వరకు అనవసరం కావచ్చని ఆశిస్తున్నారు. అంతేకాకుండా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో టీకా మందులు శీతల పరిస్థితులలో నిల్వ చేయవలసిన అవసరం కూడా వుండదు.

### గర్భిణీ స్త్రీలకు ఫోలేట్ ఆవశ్యకత

గర్భంలో పెరుగుతున్న పిండ దశలో వున్న శిశువు మెదడు, వెన్నుపాము బాగా అభివృద్ధి చెందాలంటే ఫోలేట్ అవశ్యం కావాలి. గర్భం ధరించిన స్త్రీకి ఫోలేట్ లోపం వుంటే పుట్టిన శిశువుకి వెన్నుపాము నాళంలో లోపం రావచ్చు. మెదడు బయటికి పొడుచుకు రావడంకూడా జరగవచ్చు. ఇటీవల డా.గిరాల్డిన్ కస్కొరి, సహచరులు ఐర్లండ్‌లో జరిపిన పరిశోధనలను బట్టి ఆహారంలో ఫోలేట్ తీసుకున్న స్త్రీల రక్తంలో ఫోలేట్-గాఢత చెప్పుకోదగినంతగా పెరగలేదని తేలింది. కాగా ఫోలిక్ ఆమ్లంతో బలవర్ధకం చేసిన ఆహారం లేదా ఫోలిక్ ఆమ్లం అదనంగా మాత్రలలో తీసుకుంటే కావలసినంత ఫోలేట్ శరీరంలో చేరుతుందని కనుక్కున్నారు. కనక కేవలం సహజ ఆహారంలో లభించే ఫోలేట్ గర్భిణీ స్త్రీలకు సరిపోదు. అమెరికాలో కొన్ని ఆహార పదార్థాలను ఫోలిక్ ఆమ్లంతో బలవర్ధకం చేయాలని ఇటీవల అమెరికన్ ప్రభుత్వం ఆదేశించింది. ఈ చర్యను ఈ కొత్త పరిశోధన సమర్థిస్తోంది.

-ఆర్.ఎల్.ఎన్.శాస్త్రి